క్లుప్తంగా

ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ప్రశాంతత



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ప్రశాంతత ఉంటుందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొండకెంగువలో ఆంజనేయ స్వామి ఆలయం ప్రతిష్ఠోత్సవ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలకు పాలాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాదరావు, సీనియర్ నాయకుడు బెవర ప్రసాదరావు, మాజీ ఎంపీటీసీ కంచుపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

పనుల కల్పనలో అలసత్వం వద్దు

రాజాం సిటీ: ఉపాధి పనుల కల్పనలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. మార్చి నెలకు సంబంధించి ప్రతి పంచాయతీలో ఐదు ఫారంపాండ్స్ పనులు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రతి వేతనదారుకి రూ.300లు వేతనం వచ్చేలా పనులు కల్పించాలని తెలిపారు. వ్యవసాయ పనులకు సంబంధించి అంచనాలు తయారు చేయాలని, ఇందులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ కె.సాయిరాం, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం

బొబ్బిలి: పట్టణంలోని మల్లంపేట శివాలయం వద్ద ఉన్న పెద్ద కాలువలో మురుగు నిండిపోయి ఉన్న పరిస్థితిని చూసిన కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పర్యటించిన ఆమె ప్రతిరోజూ సిల్టు తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అలాగే ఐటీఐ కాలనీ, బాలాజీ నగర్, రాజా నగర్ కాలనీ ప్రాంతాల్లో రూ.68 లక్షలతో నిర్మిస్తున్న ప్రహరీలు, షెడ్ల నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పట్టణం నుంచి మల్లంపేటకు వెళ్లే పైప్‌లైన్ నిర్మాణానికి ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళికా విభాగం సంయుక్త పర్యవేక్షణ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఉద్దవోలులో బెల్టు దుకాణం పెడితే కఠిన చర్యలు

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామంలో మద్యం బెల్ట్ దుకాణం ఏర్పాటు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు హెచ్చరించారు. బుధవారం రాత్రి గ్రామంలో తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఉద్దవోలు గ్రామంలో బెల్ట్ దుకాణం ఏర్పాటు చేసేందుకు వేలం పాట నిర్వహించేందుకు గ్రామస్తులు సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడంపై సోషల్ మీడియా, వాట్సప్ గ్రూప్‌లో హల్‌చల్ చేసింది. దీనిపై స్పందించిన బొబ్బిలి రూరల్ సీఐ గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో ఎప్పుడైనా బెల్ట్ దుకాణం ఏర్పాటు చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొనేందుకు వెనుకాడేది లేదన్నారు. ఇప్పటికైనా గ్రామస్తులంతా గ్రామంలో మద్యం బెల్ట్ దుకాణం ఏర్పాటు చేసేందుకు చేపట్టిన చర్యలను విరమించుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

చిమ్ముతున్న నిర్లక్ష్యం



బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది వేగావతి నది నుంచి ఇన్‌ఫిల్టరేషన్ బావి, మోటారు ద్వారా రామభద్రపురం మేజర్ పంచాయతీకి తాగునీటిని అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే ఈ పైపులైన్ తరచూ లీకవుతోంది. అంతర్రాష్ట్ర రహదారి గుండా వెళ్తున్న ఈ పైప్‌లైన్ శిష్టు సీతారాంపురం వద్ద ఫౌంటెయిన్‌లా ఎగసి పడుతూ తాగునీరు నిత్యం వృథా అవుతోంది. బుధవారం ఇలా లీకై ఎగసిపడింది. దీనిపై పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో రెండు మూడు రోజులకోసారి ఈ లీకులు మామూలేనని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.





- అరటి పండ్ల ధరకు రెక్కలు
- పెళ్లిళ్ల సీజన్ కావడంతో పెరిగిన ధరలు
- కిలో రూ.18 లు చొప్పున విక్రయాలు
- 150 పండ్లు ఉండే గెల రూ.350లు పైబడి పలుకుతున్న ధర

అరటి.. అధరహో

రాజాం : పెళ్లిళ్లు, శుభ కార్యక్రమాలు, సంబరాలు, యాత్రలు ప్రారంభం కావడంతో అరటి పండ్ల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. అరటి పండ్ల గెలలు కొనాలంటే చుక్కలు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అరటిని పండించే రైతు కంటే వాటిని తోటల్లో కొనుగోలు చేసి, మార్కెట్లకు తరలించే దళారీలకు అధిక మొత్తాల్లో లాభాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా వివాహ శుభ కార్యక్రమాల్లో అరటి పండ్లను పెట్టడం ఆనవాయితీ కావడంతో వీటికి డిమాండ్ పెరిగి మంచి ధర పలుకుతోంది.

మార్కెట్‌లో హాట్ కేక్‌ల్లా

రాజాం సంత మార్కెట్‌లో ప్రతీ గురువారం వారపు సంత జరుగుతోంది. ముందటి రోజే కురుపాం, పూసపాటిరేగ, వీరఘట్టం తదితర ప్రాంతాలు నుంచి ఇక్కడకు అరటిపండ్ల గెలలు వస్తుంటాయి. వీటిని వచ్చిన వెంటనే దళారీలు, కొనుగోలుదారులు హాట్ కేక్‌ల్లా కొనుగోలుచేసి పట్టుకెళ్తున్నారు. మార్కెట్‌లో డజన్ అరటిపండ్ల ధర రూ.30 నుంచి రూ.40లు పలుకుతుంది. 10 నుంచి 12 డజన్లు ఉండే అరటి గెల ధర రూ.350లు ధర పలుకుతుంది. పెళ్లిళ్లు, సంబరాలు చేసే వారంతా నాలుగు రోజులు ముందుగానే ఈ అరటి గెలలు కొనుగోలు చేసి తమ ఇండ్లకు తీసుకెళ్తున్నారు. రాజాం పండ్ల మార్కెట్ వద్ద కిలో రూ.18లు చొప్పున హోల్‌సేల్ ధరకు అరటిపండ్ల గెలల విక్రయాలు జరుగుతున్నాయి.

సాధారణ రకమే..

ప్రస్తుతం రాజాం మార్కెట్‌లో సాధారణ రకం అరటిపండ్లు మాత్రమే లభిస్తున్నాయి. రాజాం చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లో రైతులు పండిస్తున్న సాధారణ రకం అరటిని ఇక్కడకు రైతులు, దళారీలు తీసుకొస్తున్నారు. ఎక్కువగా కర్పూర పవన్ జాతికి చెందిన రకాలు విక్రయిస్తున్నారు. ఇవి చాలా చిన్న పరిణామంలో ఉంటున్నాయి. ఇందులో నాణ్యత ఉన్న గెలలకు మంచి ధర లభిస్తుంది. అమృతపాణి, చక్కెర కేళి పండ్ల అరటి గెల రూ.400లు దాటి పలుకుతుంది. గతంలో సాధారణ రకం అరటి పండ్లకు పెద్దగా డిమాండ్ ఉండేది కాదు. రూ.250లు పెడితే అరటి గెల లభించేది. ఇప్పుడు ధరలు అమాంతంగా పెరగడంతో శుభకార్యక్రమాలు జరుపుకునే కుటుంబాలు అరటి పండ్ల వినియోగానికి స్వస్తి చెబుతున్నారు.

చాలా డిమాండ్ ఉంది..

మా ఇంట్లో ఒక శుభ కార్యక్రమానికి అరటిపండ్లను కొనుగోలుచేసాం. 20 అరటిపండ్ల గెలలు రూ.7వేల రూపాయలు ఖరీదు చేశాయి. వీటి నుంచి 1800 పండ్లు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం అరటిపండ్ల ధరలు పెరగడంతో వీటిని వినియోగించాలంటేనే భయం వేస్తోంది.

– కె.రామినాయుడు, రేగిడి మండలం

నాణ్యత కొద్దీ ధరలు

రాజాం మార్కెట్‌లో అరటిపండ్లకు ఇప్పుడు డిమాండ్ ఉంది. ఒక్కో గెల రూ.700లు కూడా పలుకుతోంది. డిమాండ్ ఆధారంగా ఆయా రోజుల్లో వీటికి ధర వస్తుంది. అమృతపాణి రకం పండ్లు లభించని పరిస్థితి ఉంది. ఎంత ధర ఉన్నా కొంతమంది కొనుగోలు చేయక తప్పడంలేదు.

– వెంపటాపు రమణ, అరటిపండ్ల వ్యాపారి, రాజాం

• ఏమి హాయిలే... ఇలా...



వేసవి ఎండలు అప్పుడే మండిపోతున్నాయి. జీవరాశులు ఎండ వేడిమిని తాళలేక విలవిలలాడుతున్నాయి. ప్రజలతో పాటు మూగజీవాలు కూడా అల్లాడిపోతున్నాయి. వంగర మండల పరిషత్ కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద అధికారులు వారి పనుల్లో నిమగ్నం కాగా... శునకాలు ఇలా హాయిగా నిద్రకు ఉపక్రమించాయి. – వంగర

• ఇంటర్ పరీక్షల పరిశీలన



తెర్లాం మండలం పెరుమాళి గ్రామంలోని ఆదర్శ పాఠశాల కేంద్రంలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను బొబ్బిలి ఆర్‌డీఓ రామ్మోహనరావు బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో సౌకర్యాలు పరిశీలించారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, బెంచీలు ఉన్నదీ.. లేనిదీ పరిశీలించారు. మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు తహసీల్దార్ హేమంత్‌కుమార్ ఇతర అధికారులు ఉన్నారు. – తెర్లాం

• మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



బాలికలు, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే భవిష్యత్తు బంగారుమయమవుతుందని డీఎస్పీ జి.భవ్యారెడ్డి అన్నారు. బొబ్బిలి పట్టణంలోని అభ్యుదయ పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. సమానత్వానికి ప్రతి బాలిక, మహిళలు నిత్య సాధన చేసి తీరాలన్నారు. సీఐ కె.సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ చింత శారద తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి

• ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు



సంతకవిటి మండలంలోని అక్కరాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మహాగణపతి రమాసహిత శ్రీ సత్యనారాయణస్వామి సహిత శ్రీ కోదండ రామ మందిర ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా వేద పండితులు శ్రీ విద్యామేధా దక్షిణామూర్తి పీఠాధిపతులు రంప కోదండరామస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు పులకండం శ్రీధర్‌శర్మ పర్యవేక్షణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మంగళధ్వని పూర్వక సువాసినీలతో దేవతామూర్తుల గ్రామ ప్రదక్షిణ అనంతరం వినాయక పూజ, పుణ్యాహవచన, పరిషత్ ప్రాయశ్చిత్తం పంచాగవ్య ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ, అంకురారోపణ, జలాదివాసం తదితర కార్యక్రమాలు చేపట్టారు. – సంతకవిటి

పరిశ్రమల ఏర్పాటుకు స్థల పరిశీలన : ఆర్‌డీఓ

తెర్లాం: బొబ్బిలి నియోజకవర్గం పరిధిలో చిన్నతరహా పరిశ్రమలను రానున్న రోజుల్లో ఏర్పాటు చేసేందుకు అనుకూలమైన స్థలాన్ని తెర్లాం రెవెన్యూ పరిధిలో పరిశీలించామని బొబ్బిలి ఆర్‌డీఓ రామ్మోహనరావు అన్నారు. బుధవారం తెర్లాం వచ్చిన ఆయన తహసీల్దార్ హేమంత్‌కుమార్‌తో కలిసి నియోజకవర్గ స్థాయిలో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లా మంత్రి, కలెక్టర్‌తో జరిగిన సమావేశంలో ప్రతీ నియోజకవర్గంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు 20ఎకరాలకు తక్కువ కాకుండా స్థలాన్ని పరిశీలించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని తెలియజేశారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో అనుకూలమైన స్థలాలను పరిశీలించాలని తహసీల్దార్లకు ఆదేశించాననన్నారు. తెర్లాం మండలంలో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అనుకూలమైన స్థలాన్ని తెర్లాం రెవెన్యూ పరిధిలో తహసీల్దార్ గుర్తించి ప్రతిపాదనలు పంపించారన్నారు. దానిని పరిశీలించేందుకు విచ్చేశానని చెప్పారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని ఆర్‌డీఓ తెలిపారు.

పెరుమాళిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

మండలంలోని పెరుమాళి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు అనుకూలమైన స్థలాన్ని ఆర్‌డీఓ రామ్మోహనరావు బుధవారం పరిశీలించారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రతిపాదించిన స్థలం చెరువు గర్భానికి ఆనుకొని ఉందని, సబ్‌స్టేషన్ నిర్మాణానికి అంతగా అనుకూలమైన స్థలం కాదన్నారు. గ్రామంలో ప్రభుత్వ భూమిని చూడాలని, లేదా విద్యుత్ శాఖ అధికారులు స్థలాన్ని కొనుగోలు చేసి సబ్‌స్టేషన్ నిర్మించవచ్చని తెలిపారు. ఆయనతో పాటు తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఎంపీడీఓ రాంబాబు, ఆర్ఐ కృష్ణమూర్తి, స్థానిక నాయకులు ఉన్నారు.

దారి దోపిడీ దొంగలను వదిలే ప్రసక్తి లేదు : డీఎస్పీ

బొబ్బిలి: దారి దోపిడీలు, మహిళ మెడలో బంగారు వస్తువులను దోచే క్రిమినల్స్‌ను వదిలే ప్రసక్తి లేదని బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి అన్నారు. ఇటీవల కారాడ సమీపంలో వృద్ధురాలి మెడలో రెండు తులాల పుస్తెల తాడును తెంపుకు పోయిన మహిళ, దుండగుడిని పట్టుకుని బుధవారం రాత్రి విలేకర్ల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ భవ్యా రెడ్డి మాట్లాడారు. ఈ నెల 2న మండలంలోని కారాడ గ్రామానికి చెందిన బి.గౌరమ్మ అనే మహిళ పొలం పనికి వెళ్లింది. అట్నుంచి మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో రోడ్డు మీదుగా ఇంటికి వెళ్తోంది. ఈ సమయంలో బొబ్బిలి నుంచి చీపురుపల్లి వెళ్తున్న ఆటోలో (ఏపీ31 టీహెచ్ 4637) కొత్తవలసకు చెందిన మేకల హరి, పిట్టాడ గ్రామానికి చెందిన గొర్లె పెద్దింటమ్మ ఆమె సమీపానికి వచ్చి మీరెక్కడికి వెళ్తున్నారో అక్కడే దించేస్తామని చెప్పడంతో గౌరమ్మ ఆటో ఎక్కింది. ఊరు పొలిమేర దగ్గరకొచ్చేసరికి గౌరమ్మ మెడలోని రెండు తులాల పుస్తెల తాడును తెంపేసి ఆమెను కిందికి దించేసి ఆటోలో ఉడాయించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఎస్పీ ఆదేశాలతో బొబ్బిలి సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్ఐ ఆర్.రమేష్ బృందాలుగా విడిపోయి, తమ సిబ్బందితో సీసీ కెమెరాల పుటేజీలు, ఇతర సాక్ష్యాధారాలను సేకరించారు. బుధవారం అదే ఆటోలో నిందితులిద్దరూ బొబ్బిలి మండలం పారాది వద్ద సంచరిస్తుండగా అప్పటికే నియమించిన పోలీసు బృందాలు కాపు కాసి పట్టుకున్నట్టు డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం తరలించామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి: ప్రభుత్వ ఐటీఐలో మూడు నెలల ఉపాధి కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులయిన వారు కార్యాలయంలో ఈ నెల 6 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నాడు సంక్షేమం.. నేడు అరాచకం

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తే.. నేడు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అరాచక పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా అమలు చేసిన పాపాన పోలేదని మండిపడ్డారు. భవిష్యత్‌కు బాబు ష్యూరిటీ అని చెబుతూ టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి బాండ్లు కూడా పంచారని, అవి బాబు చేసిన మోసానికి నిదర్శనమయ్యాయని విమర్శించారు. నాడు మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పదవి లాక్కున్నారని, నేడు ప్రజలను మోసంతో వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన ఘనుడు చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వంలో రాజకీయ కక్షసాధింపులతో వైఎస్సార్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ అరాచక పాలన చేస్తున్నారన్నారు. గ్రామాలలో మద్యం ఏరులై పారుతున్నా అధికారుల కూడా చూసీచూడనట్లు ఉంటున్నారని ఆరోపించారు. కూటమి అరాచక పాలనకు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉపాధ్యాయులు బుద్ధి చెప్పారని, భవిష్యత్‌లో ప్రజలు కూడా బుద్ధి చెబుతారన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాతరేగ మాజీ ఎంపీటీసీ పెద్దింటి పైడిపునాయుడును పరామర్శించారు. వారి వెంట మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు తదితరులు ఉన్నారు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



రామినాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కర్రి రామినాయుడు కుటుంబాన్ని బొబ్బిలి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బుధవారం పరామర్శించారు. ఇటీవల రామినాయుడు భార్య సూరమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన కూనాయవలసలో రామినాయుడు ఇంటికి వెళ్లి సూరమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతో పాటు బొబ్బిలి ఏఎంసీ మాజీ చైర్మన్, కూనాయవలస ఎంపీటీసీ సభ్యుడు బొమ్మి శ్రీనివాసరావు, సర్పంచ్ బోడెల విజయబాబు, మాజీ వైస్ ఎంపీపీ బొమ్మి లక్ష్మునాయుడు ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

బొబ్బిలి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు తమ ఇళ్ల వద్ద కూడా పౌష్టికాహారం అందించాలని చిన్నారుల తల్లిదండ్రులకు ఐసీడీఎస్ సీడీపీఓ జాగాన విజయలక్ష్మి సూచించారు. మండలంలోని పారాది ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని గొర్లెసీతారాంపురం గ్రామ కేంద్రంలో ఈసీసీఈ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల బరువు, ఎత్తుల కొలతలను చూపించి ఆరోగ్యకరమైన చిన్నారుల భవిష్యత్ కోసం అన్నీ రకాల చిరుధాన్యాలతో పాటు ఆకుకూరలు, పప్పులను ప్రభుత్వం అందించిన ఆహారాలను సక్రమంగా అందించాలని సూచించారు. పాలు, పండ్లు తీసుకునే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, కార్యకర్తలు పి.పద్మ, కె.లక్ష్మి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వయసుకు తగ్గ బరువుండాలి

బొబ్బిలి: అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులు వారి వయసుకు తగ్గ బరువుండాలని ఐసీడీఎస్ సీడీపీఓ జె.విజయలక్ష్మి అన్నారు. పోషణాభియాన్ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల తల్లులకు ఆమె బుధవారం అవగాహన కల్పించారు. దీనిని నివారించేందుకు వీనింగ్ పౌడర్ అందజేయాలన్నారు. దీనిని ఎలా తయారు చేయాలి, ఏ విధంగా వినియోగించాలనే విషయమై తల్లులకు వివరించారు. కామేశ్వరి, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశ వర్కర్ మాలతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

రాజాం : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే సరుకులు సక్రమంగా వినియోగించుకోవాలని ఎంఈఓ యాగాటి దుర్గారావు సూచించారు. మండలంలోని పెనుబాక గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చిన్నారుల పెరుగుదలకు తీసుకోవల్సిన ఆరోగ్య జాగ్రత్తలు వెల్లడించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పుణ్యవతి, భాగ్యవతి, లలిత, రమణమ్మ, వాణిశ్రీ, తవిటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పరీక్ష కేంద్రం తనిఖీ

వంగర: మండల పరిధి మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని బుధవారం డెక్ మెంబర్‌లు పీవీ కృష్ణమూర్తి, కె.సత్యనారాయణ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, పరీక్షల నిర్వహణ, సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట చీఫ్ సూపరింటెండెంట్ కోట రవి శంకర్, డీఓ బీఎన్‌వీ మోహన్‌నాయుడు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కొమరాడ: రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టామని ఎంపీపీ శెట్టి శ్యామల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో క్రాష్ ప్రోగాం కార్యక్రమానికి సంబంధించిన వాహనాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఎక్కువగా బోరు బావులు మరమ్మతులకు గురవుతున్నాయని అన్నారు. ఈ వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకూడదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, ఎంపీడీఓ మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌరీశంకరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి గుర్తించాలి

వంగర: గ్రామాల్లో ప్రభుత్వ భూమిని గుర్తించాలని తహసీల్దార్ దిరిశాల ధర్మరాజు తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణం కోసం స్థలం లేని లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే ఆయా గ్రామాల్లో గుర్తించిన ప్రభుత్వ భూమిని కేటాయిస్తామని తెలిపారు. 2019 సంవత్సరానికి ముందు ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకుంటే అటువంటి లబ్ధిదారులకు పట్టాలిచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీలర్లు ఈకేవైసీ చేసుకోవాలని ఆదేశించారు.

నాణ్యమైన విద్యనందించాలి

వంగర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ-2 ఖండాపు జగదీశ్వరి అన్నారు. మండల పరిధి ఎం.సీతారాంపురం ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు.

అలసత్వం వహిస్తే చర్యలు

వంగర: పనులు నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఏపీఓ మర్రాపు సత్యవతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో పనులు చేపట్టాలని, కొలతల ప్రకారం పనులు చేపడితే గిట్టుబాటు వేతనం వస్తుందని వేతనదారులను చైతన్యం చేయాలన్నారు. ఈసీ హరినారాయణ ఉన్నారు.

బోర్లు మరమ్మతులు

సంతకవిటి: మండలంలోని గరికిపాడు పంచాయతీలో కె.ఎస్.పేటలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద మరమ్మతులకు గురైన బోరును బుధవారం క్రాష్ ప్రోగ్రాం ద్వారా మెకానిక్‌లు మరమ్మతులు చేశారు. దీంతో స్థానికుల దాహార్తి తీరింది. తాగునీటి ఎద్దడి నివారణకు క్రాష్ ప్రోగ్రాం చాలా ఉపయోగపడుతుందని ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో క్రాష్ ప్రోగ్రాం కోసం ఏర్పాటు చేసిన వాహనాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సత్యం, డీటీ మధు పాల్గొన్నారు.

ఆరుబయట మద్యం సేవిస్తే చర్యలు

వంగర: ఆరుబయట మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ షేక్ శంకర్ అన్నారు. మండల పరిధి ఎం.సీతారాంపురంలో బుధవారం ఆయన పర్యటించారు. పలువురుపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం బహిరంగంగా సేవించవద్దని అన్నారు. యువత మద్యపానానికి దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

బొబ్బిలి రూరల్: మండలంలోని గ్రామాల్లో ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికార, సిబ్బంది పని చేయాలని ఎంపీడీఓ పి.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే సంబంధిత గ్రామ ప్రజలకు టోల్ ఫ్రీ నంబరు 9441253261 కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని సూచించారు. బోర్లు మరమ్మతులకు గురైనా వెంటనే వాటిని బాగు చేసేందుకు చర్యలు చేపడతామని ప్రజలంతా గమనించాలని కోరారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

రేగిడి : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని ఎంపీడీఓ శ్యామలాకుమారి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్‌తో కలసి పలుశాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బందులు ఎదురైతే మండల కేంద్రంలో కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయాలని వెల్లడించారు. తాగునీటి సమస్య తక్షణ పరిష్కారం నిమిత్తం 9502220951కు ఫోన్ చేయాలని తెలిపారు. ఈఓపీఆర్డీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు గీతకార్మికుల మద్యం షాపులకు లాటరీ

రాజాం : రాజాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లుగీత కులాలకు కేటాయించిన మద్యం షాపులకు గురువారం ఉదయం లాటరీ వేయనున్నామని రాజాం ఎక్సైజ్ శాఖ సీఐ ఆర్.జైభీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఉదయం 9 గంటలకు విజయనగరం కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవాలని, అక్కడ ఆడిటోరియంలో లాటరీ కొనసాగుతోందని వెల్లడించారు.

పక్కాగా ఉపాధి పనులు

రేగిడి : గ్రామాల్లో ఉపాధి పనులకు వెళ్తున్న వేతనదారులు పక్కాగా పనులు చేయాలని ఏపీఓ ఎస్.హరనాధరావు వేతనదారులకు సూచించారు. మండలంలోని లక్ష్మీపురం, ఆడవరం, అక్కన్నఅగ్రహారం గ్రామాల్లో జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే రోజుకు రూ. 300లు వేతనం వస్తుందని వివరించారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా తప్పనిసరిగా పనులు చేయాలని సూచించారు.

పట్టణ ప్రణాళికా విభాగం నెట్‌వర్క్ ప్లానులు

బొబ్బిలి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇరుకు రహదారులు ఉన్న ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు ఇబ్బందులు ఉన్న దృష్ట్యా పట్టణ ప్రణాళికా విభాగం రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు కొత్తగా నెట్ వర్క్ ప్లాన్‌లు విడుదల చేస్తున్నట్టు కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించిన నాలుగు సచివాలయాల నోటిఫికేషన్‌ను బుధవారం ఆమె విడుదల చేసి నోటీసు బోర్డులో వేలాడదీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరళీకృత ప్లానుల అవసరానుసారం ఇప్పటికే 12 సచివాలయాల పరిధిలో నోటిఫికేషన్లు విడుదల చేసి ఆమోదించామనీ, ఇప్పుడు మిగిలిన నాలుగు సచివాలయాల పరిధిలో నెట్‌వర్క్ ప్లానులను విడుదల చేసినట్టు చెప్పారు. వీటిపై ప్రజలకు అభ్యంతరాలుంటే వారం రోజుల్లోగా మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని ఆమె కోరారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.